బెట్టడం. అందరికీ అందరూ కనిపిస్తూ వుంటారు. అప్పుడు ఎవర్నివారు ఇతరులకి పరిచయం చేసుకో మనడం, "నా పేరు ఫలానా. ఈ ప్రాంతం నుంచి వచ్చాను. ఈ క్లాసులో చేరాను. నాకు సంగీతం ఇష్టం లేదా తోట పని ఇష్టం"- ఇలా అందరూ ఎవరి గురించి వాళ్ళు చెప్పుకున్నాక, అందులో ఒక విద్యార్థిని పిలిచి నీ కిష్టమైన మరో విద్యార్థిని ఏవైనా ప్రశ్నలు వెయ్య మనడం. అలాగే రెండో విద్యార్థిచేత మొదటి విద్యార్థికి ప్రశ్నలు వేయించడం.

ఈ విధానంవల్ల అందరికీ అందరూ క్రమంగా- పరిచయం అవుతారు. స్నేహాలు ఏర్పడతాయి.

అప్పుడు వాళ్ళలో వాళ్ళు స్వేచ్ఛగా కబుర్లు చెప్పుకోడానికి ఒక గంట కేటాయించడం.

అరుపులు, కేకలు, నవ్వులు, కేరింతాలు, ఆట పాటలు ...

ఆటపాటల వేళ పిల్లలు ఎలా ప్రవర్తించినా మందలించడం, అదిలించడం, అదుపులో పెట్టడం చెయ్యకూడదు.

పిల్లల గుండెల్లోని ఆవేశాలనీ, ఉద్రేకాలనీ స్వేచ్ఛగా బహిర్గతం కానివ్వాలి.

అయితే ఈ వ్యవహారంలో ఓ దురుసైన కుర్రాడు మరో నెమ్మదైన పిల్లవాణ్ణి బాధించవచ్చు. అతనికి ఇబ్బంది కలిగించవచ్చు. అది గమనించి టీచర్ ఇద్దరినీ పిలిచి, రెండవవాని వేదనని సానుభూతితో విని, మొదటి వానికి 'ఇది తగదు' అని నెమ్మదిగా నచ్చ



చెప్పాలి. "ఇప్పుడు తగవులాడుకున్నా మరి కాస్తసేపటికి కలిసి పోతారు. పెద్దవాళ్ళలాగ పిల్లలు కక్షలూ, కోపాలూ పెంచుకోరు. వాళ్ళు ఇట్టే మరిచిపోతారు" అనే సత్యాన్ని టీచర్ మరిచిపోకూడదు.

ఇక్కడొక సంఘటనని వివరించడం అవసరం.

ఆయనొక పెద్ద పోలీసు ఆఫీసరు.

ఎంతో నిజాయితీతో ధార్మిక దృష్టితో అటు వృత్తినీ నిర్వహిస్తున్నాడు, ఇటు సంసారాన్నీ నడుపుకుంటు న్నాడు.

అయితే ఆయన చాలా గంభీరుడు.

సంతోషం వచ్చినా ఎవరికీ చెప్పడు. విచారం వచ్చినా ఎవరికీ తెలియనివ్వడు. ఆఖరికి భార్యకి కూడా ఏం చెప్పడు. తన మనస్సులో మాట ఇంకొకరితో పంచుకో డానికి ఆయనకి పౌరుషం, అభిజాత్యం అడ్డువస్తుంది.

అలాంటి వ్యక్తి ఓ రోజున దిగాలుపడి, మానసికమైన వ్యధ వలన వత్తిడికి లోనయి, అలా కిటికీ దగ్గర నిలబడి ఆకాశం కేసి చూస్తూ గంట గంటన్నర వుండి పోయాడు. ఏదో బాధపడుతున్నాడు మనస్సులో. ఇదీ అని ఎవరికీ చెప్పడు. అడగడానికి ఎవరికీ ధైర్యం లేదు.

ఇల్లంతా నిశ్శబ్ద వాతావరణంలో గంభీరంగా, భయంకరంగా వుంది.

ఆ సమయంలో ఆయన కూతురు అయిదేళ్ళ పిల్ల "డాడీ!" అంటూ బిక్కమొహంతో వచ్చి ఆయన్ని కౌగలించుకొంది.

అంతే!

కొండలాంటి ఆ పోలీసు ఆఫీసరు గుండె మంచులా కరిగిపోయింది ...

"ఏం లేదమ్మా! నువ్వు బాధపడకు. ఏం లేదు" అంటూ బోరున ఏడ్చేశాడు.

అంతే, ఆ ఏడ్పుతో ఆయన గుండె బరువు కొంత తగ్గింది.

తెలిసో తెలియకో, ఆయన మనస్సులోని వత్తిడిని ఆ అమ్మాయి కొంత పంచుకొంది.

దాంతో ఆయనకి కొంత భారం తగ్గింది.

ఆ రోజు సాయంత్రం వాళ్ళ కుటుంబ వైద్యుడు చెప్పిన సంగతేమిటంటే — ఆ సమయంలో ఆ అమ్మాయి వచ్చి ఆయన్ని కౌగలించుకొని, ఆయన వేదనని కొంత పంచుకొని, ఆయన మనస్సుకి ఊరట కలిగించి వుండకపోతే తీవ్రమైన గుండెపోటు ఆయనకి వచ్చి వుండునని, అది ఆయన మరణానికి కూడా దారితీసి వుండునని! *

---

మినీ కథ

# ప్రేమ పత్ర్!

"ఇవాళ ఉదయం ఓ మంచి పని చేశాను" అన్నాడు రమణ సునీత నుద్దేశించి. కాలువ గట్టు న వున్న నీలగిరి చెట్టుకు ఆనుకుని వున్న వాడల్లా ఓసారి ముందుకువంగి ఆమె వేపు చూశాడు.

"ఏమిటో?" అంది సునీత అలవోగ్గా — చిన్న చిన్న గులకరాళ్ళతో అచ్చన్నకాయల ఆట ఒక్కతే ఆడేస్తూ.

"అదేమైవుంటుందో చెప్పుకో చూద్దాం!" అంటూ మళ్ళీ చెట్టుకు జేరగిలబడ్డాడు రమణ.

అందాకా ఆడుతున్న అచ్చన్నకాయల ఆటని ఆపి రమణకేసి చూస్తూ — "ఆ ... ఏముం టుందీ ... ఎవరో ముక్కూ, మొహం తెలీని ముసలావిడ చలితో ఒణుకుతూ వుంటే నీ దుప్పటి కప్పి వుంటావు. అది కాదూ అంటే నువ్వెప్పుడూ అప్పచేసే మనిషికి అప్పు ఇచ్చి వుంటావు" అంది సునీత 'అంతేనా!' అన్నట్టు కనుబొమలు ముడిచి.

"నీ తలకాయ్! అన్నీ నీకు మసాలా సినిమా ఆలోచనలే! ఇలాంటి వేం కావు ..."

"మరి ...?"

"ఓడిపోయాను అని ఒప్పుకో చెప్పేస్తాను!"

"సరే, ఓడిపోయాను. చెప్పు!"

"అలా అన్నావు బావుంది. భాషతో ఇబ్బంది పడిపోతున్న ఓ ప్రేమికుడికి ప్రేమలేఖ రాసి పెట్టాను" అంటూ గర్వంగా ఓ పోజు పెట్టాడు రమణ.

"ఎవరా ప్రేమికుడు?"

"ఉన్నాడులే ... ఓ నాలుగు రోజుల క్రితమే పరిచయమయ్యాడు. వాళ్ళ నాన్నకి ఢిల్లీలో ఉద్యోగమట. అందువల్ల తెలుగు చదువు కునే అవకాశం లేకపోయిందట. కొద్ది రోజుల క్రితం ఓ అమ్మాయిని ప్రేమించాడట. అదీ, ప్లైటోనిక్ లవ్వేలే ... ఆ అమ్మాయి ప్రేమిం చిందీ, లేందీ కనుక్కోవడానికట ... ప్రేమ లేఖ!"

"ఎవరటా ఆ అమ్మాయి?"

"ఏమో, ఆ మహానుభావుడికి ఆమె పేరు కూడా తెలిసినట్టు లేదు."

ఒక్క క్షణం ఆగి మళ్ళీ తనే అన్నాడు రమణ - "అబ్బా!! ఎంత బాగా రాశావనీ ప్రేమలేఖ!! నాకు కవిత్వం వస్తుందనీ, నాకూ తెలుగు వాక్యాన్ని విన్యాసాలు చేయించడం తెలుసుననీ అప్పుడే తెలిసింది. అంతమంచి ప్రేమలేఖ నీకింతవరకూ రాయలేదు తెలుసా? నిజంగా, ఆ ప్రేమలేఖని అతను ప్రేమించే అమ్మాయే చదివితే టక్కున ప్రేమలో పడి పోవాల్సిందే! నువ్వు నమ్మవు సునీ! దాన్ని కాపీ చేసి వుంచుకునుంటే బావుండేది" అంటూ బాధగా మొహం పెట్టాడు.

"ఏం ఫర్వాలేదులే. అంత బాధపడకు. నీకు కావాలంటే నేనే యిస్తాను మరోసారి చదువుకో!" అంటూ వేనిటీ బ్యాగ్‌లోంచి ఉత్తరం తీసి ఇచ్చింది.

"ఇదీ ...???"

"తమరిదే ... నీ ఫ్రెండుగాడు నాకే ఇచ్చాడు. చక్కటి చెంపదెబ్బ ఒక్కటి మాత్రం బహుమతిగా ఇచ్చాను."

వెలక్కాయ పట్టేంత నోరు తెరిచి అలా చూస్తూ వుండిపోయాడు రమణ.

—చిలుకూరి దేవపుత్ర